# అతను సోంబేరి కాదు!

పాపారావ్ తన భార్య పావని కంటే ఒక అడుగున్నర పొట్టిగా ఉంటాడు. పావని దాదాపు ఆరు అడుగుల పొడుగు. ఆమె కంటె ఎత్తయిన వాడ్ని కట్టబెడదామని ప్రయత్నం చేశారు. కాని కుదరలేదు! పావనికి చుట్టాలలో చాలామంది, "నీకంటే పొట్టివాడే కాని చదువులో గట్టివాడు పైగా భార్యకంటే మొగుడు పొడుగ్గా వుంటే నెత్తిమీద సుళువుగా మొట్టడానికి అవకాశం తక్కువ, అదే అతను పొట్టిగా వుంటే, ఏ సంక్రాంతికైనా, అడిగిన పట్టుచీర కొనివ్వకపోతే అతని నెత్తిమీద నీ మెడ నొప్పిపెట్టకుండా నాలుగు మొట్టికాయలు వడ్డించవచ్చు."

పాపం! పావనికి చిన్నప్పట్నుంచీ ఎవరి నెత్తిమీదైనా మొట్టడం సరదా! ఇంట్లోనే వున్న మొగుడ్ని మొట్టడం అనేది శ్రమ లేకుండా చెయ్యకల్గిన పని కదా అని ఆ పొట్టి పాపారావ్‌ని కట్టేసుకుంది!

పావని తన జీవనయాత్రలో పోను పోను కొన్ని యిబ్బందులు ఎదుర్కొంది. ఏ శుభకార్యాలకైనా వెడితే పాపారావ్‌ని తన పక్కకి ఎక్కువసార్లు రానిచ్చేది కాదు. భర్త పొట్టివాడని నలుగురూ పరిహాసం చేస్తారని! దంపతి తాంబూలాలు తీసుకోవడానికి యిష్టపడేది కాదు!

రోజూ పొద్దున్నే లేచి పార్క్‌కి వాకింగ్‌కి వెళ్ళేవారు! కాని, ఆ పార్కులోని వారికి, వీళ్ళద్దరూ దంపతులని తెలియదు. చాలా జంటలు కలిసి నడిచేవారు. కాని పావని మాత్రం తన భర్తతో కలిసి నడిచేది కాదు. నడక వలన అలసట చెందిన కొంతమంది సిమెంట్ బెంచీల మీద కూర్చునేవారు. ఒకసారి పాపారావ్ పక్కన కూర్చున్న ఒకతను దురదృష్టవసాత్తూ "మాస్టారూ! అక్కడకూర్చున్న బాగా పొడుగాటి ఆవిడని చూడండి! అదే ఆకుపచ్చని చీర కట్టుకున్నావిడ! రోజూ ఒక్కర్తే వాకింగ్‌కి వస్తారు. మరి ఆమె భర్తని ఒక్కసారికూడా ఈ పార్కులో ఆమెతోపాటుగా చూడలేదు. బహుశః ఈవిడ వాకింగ్‌కి బయల్దేరే ముందు కాఫీ ఇస్తే తాగి మళ్ళీ ముసుగు తన్నేస్తాడు కాబోలు సోంబేరిగాడు!" అన్నాడు.

ఆ ఆకుపచ్చని చీర కట్టుకున్నావిడ ఎవరో కాదు పాపారావ్ భార్యే! "పోన్లేండి సార్! ఆమె భర్త విషయం మనకెందుకు" అన్నాడు, పాపారావ్.

"ఒక బాధ్యతగల పౌరుడిగా ఆలోచించండి! అసలు బద్ధకస్తులైన ఈ సోంబేరిగాళ్ళ వల్లే దేశం పీడకొట్టుకు పోతుంది సార్!

నేను తొందరగా ఆఫీసకెళ్ళాలి. మీరు ఆలోచించమని చెప్పిన విషయం గురించి

తర్వాత చెబుతాను" అని పార్కునుంచి నిష్క్రమించాడు, పాపారావ్.

మనస్సు బాధతో నిండిపోయిన పాపారావ్ పావనిమీద రుసరుస లాడాడు. "ఎప్పుడూ నీ పక్కన నిలబడనివ్వవ్! నీ కంటే తక్కువ ఎత్తుగా వుండడం అభ్యంతరమయితే, ఓ తాడిచెట్టు సమానుడ్ని పెళ్ళి చేసుకోవలసింది! నేను ఎమ్.ఎస్.సి.లో బంగారు పతక గ్రహీతని! "ఆమె భర్త ఎప్పుడూ వాకింగ్‌రాడు! అంటే ఓ సోంబేరి అయ్యుంటాడు" అన్నాడు ఒకడు. నా మనస్సు మండిపోయింది!" పైగా సోంబేరుల వలననే దేశం పాడయిపోతుందన్నాడు. రేపట్నుంచి మనమిద్దరం కలిసే నడుద్దాం.

"బాగుంది వరస! కనీసం యింకొక్క మూడు అంగుళాలయినా ఎదగమని చాలాసార్లు చెప్పాను. మీరు ఆ మాత్రం ఎత్తు సాధించండి, అప్పుడు మనం కలిసి మెలిసి నడుద్దాం!" అంది పావని.

"ఎలాగా యిక ఎత్తు ఎదగలేనని, ఈ ఎత్తు వేస్తున్నావ్ నువ్!"

"సర్లెండి తర్వాత మాట్లాడదాం! ఇక ఆఫీస్‌కి తయారవ్వండి!"

---

ఆ మర్నాడు పొద్దున్నే పావనీ అండ్ పాపారావ్ వాకింగ్‌కి బయల్దేరారు. "నేను వెళ్ళిన ఓ అయిదు నిమిషాలకి యిల్లు తాళం వేసి బయల్దేరండి! నిన్న వాడెవడో మిమ్మల్ని "సోంబేరి" అన్నాడు కదానని, "నేనే ఆవిడ భర్తని" అని మాత్రం చెప్పకండి అంటూ, పార్కుకి వెళ్ళిపోయింది, పావని.

పాపారావ్ పార్కులోకి వెళ్ళడమే తరువాయి, "ఉండండి సార్ మనిద్దరం కలిసి నడుద్దాం! "అంటూ", అది సరే నడవకుండా స్తబ్దగా వుండేవాళ్ళని "సోంబేరి" అనడం తప్పా సార్! అని మొదలెట్టాడు. ఆ విమర్శకుడు.

తప్పులేదు కాని, మనిద్దరం నడుస్తున్నాం కదా ఆవిడ భర్త "సోంబేరి" అయితే మనకెందుకు వదిలెయ్యండి!" అన్నాడు పాపారావ్.

వాకింగ్ పూర్తిచేసుకుని వాళ్ళిద్దరూ ఓ సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు.

వాకింగ్ పూర్తిచేసుకుని ఒక్కొక్కళ్ళే యిళ్ళకి బయల్దేరారు. "అమ్మో అని గట్టిగా అరిచిన ఓ మహిళ గొంతు వినపడింది! ఇంతలో "దొంగ! దొంగ! మంగళ సూత్రం తాడు పట్టుకుపోతున్నాడు పట్టుకోండి!" అని అరిచారు, పార్కు గేటు దాటి రోడ్ వైపు నడుస్తున్న మహిళలు.

పారిపోతున్న దొంగని చూసాడు పాపారావ్! ధన్ మని ఓ దూకు దూకి వాడ్ని పట్టుకోబోయాడు, వాడు పాపారావ్ కడుపులో రెండు గుద్దులు గుద్దాడు.

వెర్రి దొంగవెధవ! చిన్నప్పుడు విపరీతమైన అల్లరి చేసి, చాలా గుద్దులు తినిని పాపారావ్‌కి ఆ రెండు గుద్దులూ ఏపాటి! పైగా చిన్నప్పట్నుంచీ వ్యాయామం చేసినవాడు! ఆ దొంగ వెధవ మెడమీద ఓ "నవాబ్‌జంగ్" యిచ్చాడు. అంతే మెదడు గిర్రున తిరిగి వాడు పడిపోయాడు! ఆ బంగారపు గొలుసు సూత్రాలతో సహా వెనక్కి తీసుకు వచ్చి "ఎవరిది యిది" అన్నాడు, పాపారావ్.

"ఆ గొలుసు ఈమెదే" అని పావనిని చూపించారు. తను ఆమె భర్త కానట్లు, పెద్ద పోజు కొడుతూ, "ఊ! తీసుకోండి!" అని యిచ్చేశాడు. అప్పటికే అక్కడ చేరిన పురుష బృందంలో ఒకడు "ఎవరు సార్! వాడి మెడమీద ఒక్క దెబ్బ బలే కొట్టారు! మీరు పొడగరి కనుక చాలా సులువుగా కొట్టకలిగారు! మీ పేరేమిటి సార్! అన్నాడు.

ఓ దొంగని పట్టుకున్న విజయగర్వంతో నిండిన ఉత్సాహంతో, తన పేరుకు ముందు తానే మిస్టర్ అని చేర్చి "మిస్టర్ పాపారావ్" అని ఎలుగెత్తి చాటాడు.

"మిస్టర్ పాపారావ్" జిందాబాద్! అంటూ పాపారావ్ గారు ఓ పెద్దపులి!" అన్నారు ఓ మనిషిని జంతువులతో పోలుస్తున్నారన్న విషయం గమనించని పాపారావ్ సంతోషించాడు.

"బాబూ, నీకు పెళ్ళయిపోయిందా!" అని అడిగింది ఓ ప్రౌఢ! ఏ ద_ _ న_ సంబంధం కుదుర్చేస్తుందేమోనన్న భయంతో, "రెండేళ్ళ క్రితమే అయిపోయింది! నేనే ఈయన భార్యని" అంటూ పాపారావ్ ప్రక్కన నిలబడింది పావని.

"ఔనా మీ యిద్దర్నీ రోజూ పార్కులో చూస్తున్నాం, కాని మీరు భార్యా భర్తలన్న విషయం మాకు తెలీదు!"అన్నారు. కొంతమంది! "పొట్టి అవడం వలన దగ్గరికి చేరనీయడం లేదంటుందేమోనన్న భయంతో", నా భార్యకి సిగ్గు ఎక్కువ అందుకే నాతో పాటు నడవదు" అన్నాడు పాపారావ్.

"మీకు భలే ధైర్యం! మీకు గాంభీర్యం కూడా ఎక్కువ! రోజూ ఆమె భర్త ఓ సోంబేరి అయివుంటాడు! వాకింగ్‌కి రాడు!" అంటూన్న మీరే ఆమె భర్త అని ఎందుకు చెప్పలేదు సార్! అన్నాడు రోజూ పాపారావ్‌ని సతాయించిన వ్యక్తి.

"నిజం నిప్పులాంటిది! అని ఎప్పటికైనా బయటపడుతుందని తెలుసు నాకు!" అని పోజుకొడుతూ చెప్పాడు పాపారావ్.

"ఒకే! బై" అంటూ దర్జాగా పావనితో కలిసి పార్కు నుంచి మొదటిసారి యింటికెళ్ళాడు పాపారావ్.

"నన్ను క్షమించండి. మీరు దొంగ మెడమీద దెబ్బ కొట్టడానికి సరిపడ పొడగరి అని ఎవరో చెపుతేగాని తెలుసుకోలేక పోయిన మూర్ఖురాలిని నేను! మగాడు కేవలం పొడుగుగా వున్నంత మాత్రాన వుపయోగం లేదని, గుండె ధైర్యంగల మీలాంటి వారే అసలు సిసలైన మగవారని తెలుసుకున్నాను! ఇక రోజూ మనం కలిసే వాకింగ్ వెళదాం! అంది పావని.

"ధైర్యం గలవాడే మగాడన్న నిజం నువ్ తెలుసుకున్నట్లే, దొంగలు కొంతమంది భార్యాభర్తలతో పరస్పానురాగం కలగ చేస్తారని నేనూ తెలుసుకున్నాను."

అసలు నేను చాలా రోజులబట్టీ నీ కొక విషయం చెప్పాలను కుంటున్నాను! మా మేనమావ ఒకడు ఆరు అడుగుల పొడగరి! పిల్లి "మ్యావ్" అంటే చాలు, ఎంత వేసం కాలమయినా దుప్పటీ కప్పుకుని మంచం కిందకి దూరేశేవాడు! అతన్ని "మ్యావ్ మావయ్య" అని ఆట పట్టించేవాళ్ళం! మగాడు పొడగరి అయితే చాలదు, ధైర్యం వుండాలి అని నా అంతట నేను చెపుతే నువ్ నమ్మవని నేను చెప్పలేదు! ఆ దొంగ దయవలన ఈ విషయం నువ్వే గ్రహించావ్! చాలా సంతోషం." అన్నాడు పాపారావ్.

(విపుల మే 2013)